యూనిట్ IV

# 13. సంస్కరణ

– నండూరి రామమోహన రావు

## ఆలోచించండి - చెప్పండి



©SCERT not to be republished

### ప్రశ్నలు

1. మొదటిచిత్రంలో ఉన్నది ఎవరు?
   ఆయన ఎలా ప్రసిద్ధులు ?
2. రెండోచిత్రంలో ఉన్నది ఎవరు ?
   వారు ఎవరికోసం కృషి చేశారు ?
3. సాంఘిక దురాచారాలు అంటే ఏమిటి?
4. నేడు మన సమాజంలో
   ఏ ఏ దురాచారాలు ఉన్నాయి?

### ఉద్దేశం

వార్తాపత్రికల్లోని సంపాదకీయాలు, వ్యాఖ్యలు సమాజ చైతన్యానికి తోడ్పడతాయి. కాబట్టి విద్యార్థుల్లో సంపాదకీయ వ్యాసాల పట్ల, వ్యాఖ్యల పట్ల అభిరుచి కలిగించాలనేది ఈ పాఠం ఉద్దేశం.

**ఈ పాఠం "నండూరి రామమోహన్‌రావు వ్యాఖ్యావళి" గ్రంథం లోనిది.**

### విద్యార్థులకు సూచనలు

1. పాఠం చదవండి. పదపట్టిక చూసి తెలియని పదాలకు అర్థాలు తెలుసుకోండి.
2. సందర్భానికి తగిన అర్థాలు గ్రహించి చిత్రాల ఆధారంగా పాఠం భావాన్ని గ్రహించండి.
3. అర్థంగాని విషయాల గురించి మొదట జట్టులో చర్చించండి. తర్వాత ఉపాధ్యాయుడితో చర్చించి అవగాహన పెంచుకోండి.

శాసనాలు చేసినంతమాత్రాన ఏ సాంఘిక సంస్కరణ ప్రయత్నం విజయవంతం కాబోదు. దాని ఆవశ్యకతను ప్రజలు గుర్తించాలి. దానికి సంబంధించిన మానసిక చైతన్యం వారిలో ప్రస్ఫుటించాలి. వారి నుంచి పూర్తి సహకారం రావాలి.

అతి బాల్య వివాహాలు ఈనాడు ఎక్కడైనా చెదురుమదురుగా జరుగుతున్నవేమోగాని, ఒక పెద్ద సాంఘిక సమస్యగా పరిగణించదగినంతగా జరగడంలేదు. ఈ పరిణామం సాధ్యం కావడానికి శారదా శాసనం ఒక్కటే కారణమని అనుకోలేము. బాల్య వివాహ దురాచారాన్ని రూపుమాపడానికి ఎందరో మహామహులైన సంఘ సంస్కర్తలు కృషిచేశారు. వారి కృషిఫలితంగా ప్రజలలో వాటిపట్ల కలిగిన ఏవగింపు ఈ దురాచార నిర్మూలనకు ముఖ్యకారణం.

**శారదా శాసనం**

మన దేశంలో బాల్య వివాహాల నిర్మూలనకు సంఘ సంస్కర్తల ఉద్యమాల ఫలితంగా బ్రిటిష్ ఇండియా గవర్నమెంటు 28-09-1929లో "రావ్ సాహెబ్ హరబిలాస్ సర్దా" పేరుతో ఇచ్చిన శాసనం. ఇది శారదా శాసనం గా ప్రసిద్ధి పొందింది. ఈ శాసనంలో అమ్మాయిలకు 14 సం॥లు, అబ్బాయిలకు 18 సం॥ నిండకుండా వివాహం చేయటం నిషేధించారు. ఈ శాసనం చేసిన ఆరు నెలలకు అనగా 01-04-1930 నుండి అమలులోకి వచ్చింది.

అదే విధంగా తరతరాలుగా మన సమాజాన్ని బాధిస్తున్న మరొక దురాచారం వరకట్నం. దీన్నికూడా నిషేధిస్తూ శాసనాలు లేకపోలేదుగాని, ఇది నిర్మూలన కాలేదు సరిగదా, నానాటికీ పెనుభూతంవలె పెరిగిపోతున్నది.



మొన్న హైదరాబాదులో ఒక సభలో ప్రసంగిస్తూ ఒరిస్సా ముఖ్యమంత్రి శ్రీమతి నందినీ శతపథి స్త్రీల అభ్యున్నతికి అవరోధాలుగా నిలిచిన రెండే రెండు ముఖ్యసమస్యలు విద్యావిహీనత, వరకట్నపు దురాచారం అని పేర్కొన్నారు. నిజమేగాని, మొదటిదాని కంటె రెండవదే జటిల సమస్య.

**నందినీ శతపథి**

ఒరిస్సా రాష్ట్రానికి తొలి మహిళా ముఖ్యమంత్రిగా 1972 - 1976 మధ్య పని చేసారు. రెండు సార్లు రాజ్యసభ సభ్యులుగా ఉన్నారు.

ఒకప్పటి సంగతి ఏమైనా, ఈనాడు స్త్రీ విద్యావశ్యకత గురించి వ్యతిరేకాభిప్రాయం దాదాపుగా లేదు. ఈనాడు అది ప్రయత్నపూర్వకంగా సాధించవలసిన సంస్కరణ కాదు. అవకాశాలు లేకపోవడమే స్త్రీలలో విద్యావ్యాప్తి చురుకుగా జరగకపోవడానికి కారణం.

© SCERT not to be republished

మొత్తం జనాభాలోనే నూటికి 70మంది విద్యాశూన్యులైనప్పుడు తరతరాలుగా పురుషులకంటె అన్ని విధాలుగా వెనుకబడిన స్త్రీలు విద్య విషయంలో కూడా వెనుకబడి ఉండడంలో ఆశ్చర్యంలేదు.

వరకట్నపు దురాచారం మాత్రం ఇందుకు భిన్నమైన సమస్య. దీని నిర్మూలనకు ప్రజలే సిద్ధంగా లేరనడం సత్యదూరంకాదు. వరకట్నం పుచ్చుకొనడం, ఇవ్వడం కూడా ప్రతిష్ఠకు, సంఘంలో గౌరవానికి సంబంధించిన విషయాలుగా చెల్లుతున్నాయి. కట్నం అసలు తీసుకొనకపోవడం నలుగురిలో చిన్నతనంగా వరునివైపువారు భావించినట్టే, అది వరునివైపు ఏదో లోపానికి సూచనగా వధువు వైపువారు, ఇతరులు భావించడం సర్వ సామాన్యంగా జరుగుతున్నది. దీన్నిబట్టే ఎంత



హెచ్చుకట్నం ఇస్తే, తీసుకుంటే అంత ఘనంగా భావించడం కూడా వున్నది. ఈ భావాల నిర్మూలనకు మొదటగా ప్రయత్నం జరగాలి,ప్రచారం జరగాలి.

దీనితో ముడిపడిన సమస్య అసలు వివాహాలను జరిపే తీరు. ఎంత వైభవంగా, ఎంత ధనవ్యయం చేసి వివాహం జరిపిస్తే అంత ఘనతగా పరిగణించడం మన సమాజంలో పరిపాటి. నిరాడంబరంగా వివాహం జరపడానికి సంఘం హర్షించదు. ఇందువల్ల ఎంత శక్తిహీనుడైనా అప్పోసప్పో చేసి ఘనంగా వివాహం జరిపినట్టు అనిపించుకోవలసివస్తున్నది. ఇంతేకాదు, వివాహ సమయంలో బంధుమిత్రులు వధూవరులకు చదివించే కానుకల హెచ్చు తగ్గులు కూడా ప్రతిష్ఠకు సంబంధించిన విషయంగా పట్టించుకునే స్థితికి మన సంఘం దిగజారిపోయింది.

ఈ దురాచారాల నిర్మూలనకు శాసనాలు అవసరమే కావచ్చు. కానీ, అంతకంటే ముఖ్యంగా వీటిపట్ల ఏహ్యాభావాన్ని ప్రజలలో కలిగించడం ముఖ్యం. వీటిపట్ల యువతీ యువకులు ఎదురుతిరిగేటట్టు చేయడం ముఖ్యం. శాసనాలు మాత్రమే దీన్ని సాధించలేవు.



## రచయిత పరిచయం



**నండూరి రామమోహనరావు**

తెలుగు పాత్రికేయులలో సుప్రసిద్ధులైన నండూరి రామమోహన రావు (1927-2011) కృష్ణాజిల్లా విస్సన్న పేటలో జన్మించారు. జ్యోతి, ఆంధ్రజ్యోతి, బాలజ్యోతి, వనితాజ్యోతి మొదలైన పత్రికల్లో సంపాదకులుగా పనిచేసారు. విశ్వరూపం, నరావతారం, విశ్వదర్శనం వీరి ప్రముఖ రచనలు. నండూరి వారి సంపాదకీయ వ్యాసాలు అయిన "అనుపల్లవి", "చిరంజీవులు", "నండూరి రామమోహనరావు వ్యాఖ్యావళి" పేరిట సంకలనాలుగా వచ్చాయి. పిల్లలకోసం కొన్ని ఇంగ్లీషు నవలలను తెలుగులో రాశారు. "చిలకచెప్పిన రహస్యం", "మయూరకన్య " పిల్లల నవలలు. "హరివిల్లు" పేరిట పిల్లలగేయాలు రాశారు.

తెలుగు విశ్వవిద్యాలయం వీరికి గౌరవ డాక్టరేటు ఇచ్చి గౌరవించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తమ పాత్రికేయుడు అవార్డుతో సత్కరించింది.

### ప్రక్రియ - సంపాదకీయ వ్యాసం

సమకాలీన సంఘటనలతో ముఖ్యమైన వాటిని తీసుకుని పత్రికల్లో వ్యాఖ్యానరూపంగా పూర్వాపరాలను పరామర్శిస్తూ సాగేరచన సంపాదకీయ వ్యాసం. దీన్ని పత్రికా సంపాదకులు గానీ, ప్రత్యేక వ్యాసకర్తలు గానీ రాస్తూ ఉంటారు. తక్కువ మాటల్లో పాఠకులను ఆకట్టుకునేటట్లు, ఆలోచించేటట్లు చేయగలగడం మంచి సంపాదకీయ లక్షణం. ఇవి తత్కాలానికి సంబంధించినవే అయినా ఒక్కొక్క సందర్భంలో విభిన్న కాలాలకూ వర్తిస్తుంటాయి.

© SCERT not to be republished

## ఇవి చేయండి

### I. వినడం - మాట్లాడడం.

1. మీరు గమనించిన దురాచారాలు, మూఢనమ్మకాలపై మీ అభిప్రాయాలు చెప్పండి.
2. ప్రస్తుతం సమాజంలో ఉన్న సాంఘిక దురాచారాలు ఏవి? వాటి నిర్మూలనకు మీవంతు కృషిగా ఏమి చేయాలనుకుంటున్నారు?
3. "వరకట్న నిర్మూలన" కు రావలసిన మార్పులను "వరుని వైపు - వధువు వైపు" జట్లుగా విడిపోయి చర్చించండి.

### II. చదవడం, అవగాహన చేసుకోవడం

**1. కింది పదాలు ఏ పేరాలోనివో గుర్తించి. ఆ పదాన్ని దేనికి సంబంధంగా వాడారో రాయండి**

| పదం | పేరా సంఖ్య | ఎందుకోసం వాడారు |
|---|---|---|
| పెనుభూతం | | |
| జటిల సమస్య | | |
| రూపుమాపడం | | |
| పరిపాటి | | |

**2 కింది పేరాను చదవండి.ఎక్కడ?, ఏమిటి?, ఎందుకు?, ఎవరు?, ఎలా? అనే పదాలతో ప్రశ్నలు రాయండి.**

వేమన జన్మించింది, తిరిగిందీ రాయలసీమే ఐనా ఆయన పద్యాలు, ఆయన సందేశం, ప్రభావం ఆంధ్రదేశమంతా ఉంది. వీరి పద్యాలు వివిధ భాషల్లోకి అనువాదమయ్యాయి. వేమన సందేశానికి దేశవ్యాప్తంగానే కాక ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వచ్చింది. సమాజంలోని ఎక్కువ తక్కువలు, వివక్షలు, అంటరానితనం, అంధ విశ్వాసాలు, పాలకుల అత్యాచారాలు, జీవహింస, అవినీతి, అధర్మం మొదలైన విషయాలపై తన సరళమైన పద్యాల ద్వారా ప్రజల మనస్సులో హత్తుకు పోయేటట్లు విమర్శనాత్మక రచనలు చేసాడు. కులవ్యవస్థపై దాడి చేశాడు. స్వానుభవమైన, ఆచరణయోగ్యమైన తత్త్వాన్ని సరళ భాషలో ప్రజలకు చెప్పి ప్రజా కవిగా తెలుగువారి మదిలో శాశ్వతస్థానం పొందారు.

**3 కింది పట్టికను చూడండి. సదాచారం ఏదో దురాచారం ఏదో గుర్తించండి. కారణం రాయండి.**

| అంశం | సదాచారం / దురాచారం |
|---|---|
| బాల్య వివాహాలు చేయడం | |
| పెద్దలను గౌరవించడం | |
| వరకట్నం తీసుకోవడం / ఇవ్వడం | |
| తల్లిదండ్రులకు సేవచేయడం | |
| వృద్ధులను వృద్ధాశ్రమాల్లో చేర్చడం | |
| స్త్రీ విద్యను ప్రోత్సహించడం | |
| బడి ఈడు పిల్లలను పనుల్లో పెట్టడం | |
| ఆడ పిల్లలకు తొందరగా పెండ్లిళ్ళు చేయడం. | |
| చిన్న పిల్లలను వసతి గృహాల్లో ఉంచి చదివించడం | |
| తోటి వారిని ఎవరినైనా సమానంగా చూడడం. | |

© SCERT not to be republished

**4 పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి**

(అ) శాసనాలు అమలు కావాలంటే ఏమి చేయాలని నండూరి వారు అన్నారు?

(ఆ) బాల్య వివాహాలు తగ్గుముఖం పట్టడానికి ఏమేమి తోడ్పడతాయి?

(ఇ) వరకట్న దురాచారం గురించి రచయిత అభిప్రాయం ఏమిటి?

## III. స్వీయరచన

**1 కింది ప్రశ్నలకు ఐదు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

(అ) నేడు పెళ్ళిళ్ళ సందర్భంగా ఎన్ని రకాలుగా ధనం వృథా అవుతుందో మీరు గమనించిన విషయాలు రాయండి.

(ఆ) నేటికీ సమాజంలో ఏఏ దురాచారాలు కనపడుతున్నాయి? దానికి కారణాలేమిటి?

(ఇ) దేశంలో వందశాతం అక్షరాస్యత ఇంకా సాధించలేక పోవడానికి కారణాలు ఏమిటి?

2 కింది ప్రశ్నలకు పది వాక్యాలలో జవాబులు రాయండి.

(అ) **ఆడంబరంగా పెళ్లిళ్లు చేయడం కోసం అధికంగా ఖర్చు చేయడం** – దీన్ని వ్యతిరేకిస్తూ సరైన కారణాలు రాయండి.

(ఆ) సమాజంలో దురాచారాల పట్ల ప్రజల్లో ఏహ్యభావం కల్గించడం ద్వారా వాటిని నిర్మూలించవచ్చని నండూరి వారు అన్నారు కదా! దీన్ని సమర్థిస్తూ రాయండి.

(ఇ) 'స్త్రీలందరూ విద్యావంతులైతే, వరకట్న నిర్మూలనజరుగుతుంది' – దీనిపై మీ అభిప్రాయాలను తెలుపుతూ వ్యాసం రాయండి.

## IV. పదజాలం

1 కింది పదాలకు సమానార్థాన్నిచ్చే పదాల సమూహంలో సమానార్థాన్ని ఇవ్వని పదం ఉంది. దాన్ని గుర్తించండి.

ఉదా : ఇనుడు – సూర్యుడు, రవి, <u>ఇంద్రుడు</u>, భానుడు

(అ) పరిణయం– పెళ్లి, పరిమళం, మనువు, వివాహం

(ఆ) శాసనం – ఆజ్ఞ, చట్టం, ఉత్తరం, ఉత్తరువు

(ఇ) స్త్రీ – కొమ్మ, బంతి, పడతి, ఉవిద

(ఈ) ధనం – విత్తం, దండనం, ద్రవ్యం, పైకం

(ఉ) అభ్యున్నతి – తిరోగతి, ప్రగతి, పురోగతి, అభివృద్ధి

2 కింది ప్రకృతి, వికృతి పదాల ఆధారంతో వాక్యాలు రాయండి.

**(విద్య–విద్దె, స్త్రీ – ఇంతి, నిజం – నిక్కం, యత్నం – జతనం)**

ఉదా॥ (అ) <u>విద్య</u> రహస్యంగా దాచిన ధనం వంటిది.

జ. <u>విద్దె</u> లేనివాడు వింత పశువు.

(ఆ) నేడు <u>స్త్రీలు</u> అన్నిరంగాలలో అభివృద్ధి చెందుతున్నారు.

జ. ______________________

(ఇ) <u>నిజం</u> నిర్భయంగా చెప్పాలి.

జ. ______________________

(ఈ) నిరంతర <u>యత్నం</u> వల్ల పనులు సాధించవచ్చు.

జ. ______________________

© SCERT not to be republished

3 కింది వానిని సొంతవాక్యాలలో రాయండి

(అ) పెనుభూతం (ఆ) తరతరాలు (ఇ) నిరాడంబరం (ఈ) అప్పోసప్పో

(ఉ) దిగజారి పోవు (ఊ) దురాచారాలు (ఋ) శాసనాలు (ౠ) హెచ్చుతగ్గులు

## V. సృజనాత్మకత

వరకట్నానికి రోజూ ఎంతోమంది బలైపోతున్నారు. వీటిని గురించి పత్రికల్లో, టి.వి.ల్లో రోజూ చూస్తూనే ఉన్నాం. వరకట్నం లాంటి భయంకరమైన దురాచారాన్ని నిర్మూలించాలనే భావం ప్రజల్లో కలిగేటట్లు "పోస్టర్" తయారు చేయండి.

(లేదా)

ఈ మధ్యకాలంలో పెండ్లిళ్ళు, ఇతర కార్యక్రమాల్లో సుమారు 20% ఆహార పదార్థాలు వృథా అవుతున్నట్లు నివేదికలు తెలుపుతున్నాయి. దీన్ని అరికట్టడానికి నియమావళి రూపొందించి మరో పోస్టర్ రూపొందించండి.

## VI. ప్రశంస

రంగాపురం గ్రామంలో 'రాధ' 10వ తరగతి చదువుతున్నది. ఆమెకు వివాహం నిశ్చయమైంది. ఆ గ్రామంలోని "బాలల హక్కుల వేదిక" సభ్యులు వెళ్ళి బాల్య వివాహం జరుపడం వల్ల నష్టాలను 'రాధ' తల్లిదండ్రులకు వివరించారు. బాల్య వివాహాన్ని ఆపారు. రాధ తన చదువును తిరిగి కొనసాగించింది. రాధ వివాహం ఆపిన "బాలల హక్కుల వేదిక"ను అభినందిస్తూ ఒక లేఖ రాయండి.

## VII. భాష గురించి తెలుసుకుందాం

1 కింది పదాలను విడదీసి సంధిపేరు రాయండి.

ఉదా॥ చేసినంత – చేసిన +అంత = అత్వసంధి

(అ ) ఎక్కడైనా (ఆ.) కారణమని (ఇ.) బాధిస్తున్న

(ఈ) నిజమే (ఉ.) ఏమైన (ఊ.) లేరనడం (ఋ.) హీనుడైన

2 కింది సమాస పదాలకు విగ్రహ వాక్యాలు రాసి, సమాసం పేరు రాయండి.

ఉదా॥ సంఘ సంస్కర్తలు – సంఘమును సంస్కరించేవారు. ద్వితీయా తత్పురుష సమాసం.

(అ) వరకట్నం (ఆ) స్త్రీల అభ్యున్నతి (ఇ) విద్యావిహీనత (ఉ) విద్యావ్యాప్తి

(ఊ) ధన వ్యయం (ఋ) శక్తి హీనుడు



© SCERT not to be republished

3 ముందు పాఠాల్లో క్త్వార్థకం, చేదర్థకం, శత్రర్థకం క్రియలను గురించి తెలుసుకున్నారు కదా!

కింది వాక్యాలలో గీతగీసిన క్రియలు వేటికి చెందుతాయో గుర్తించండి.

ఉదా : నీటిని వృథా చేస్తే భవిష్యత్తులో ప్రజలు నీటికోసం ఇబ్బందులు పడ్తారు. చేదర్థకం

(అ) టి.వి. ఎక్కువగా చూస్తే విలువయిన సమయం వృథా అవుతుంది. = ------------

(ఆ) అప్పన్న కొట్టు కెళ్ళి మంచివి ఏరి తీసుకురా! ------------

(ఇ) దీప దిక్కులు చూస్తూ నడుస్తోంది. ------------

(ఈ) అఖిల పాటలు వింటూ ముగ్గులు వేస్తున్నది. ------------

(ఉ) మేథో వలస తగ్గితే మన దేశాభివృద్ధి వేగం పుంజుకుంటుంది. ------------

(ఊ) మీ అక్క భోజనం చేసి లేవలేకపోతోందేమో? ------------

(ఋ) మహేశ్ తేనీరు తాగుతూ పత్రిక చదువుతున్నాడు. ------------

4. తత్పురుష సమాసాలు

విభక్తుల ఆధారంగా ఏర్పడే తత్పురుష సమాసాల గురించి తెలుసుకున్నారు కదా! కింది వాటిని కూడా పరిశీలించండి.

1. మధ్యాహ్నము - అహ్నము యొక్క మధ్యము (మధ్య భాగము)

2 పూర్వ కాలము - కాలము యొక్క పూర్వము

పైవాటిలో మొదటి పదాలైన'మధ్య' 'పూర్వ' అనే పదాలకు 'ము' అనే ప్రథమా విభక్తి ప్రత్యయం చేరడం వల్ల 'మధ్యము', 'పూర్వము'గా మారతాయి. ఇలా పూర్వ పదానికి ప్రథమా విభక్తి ప్రత్యయం రావడాన్ని 'ప్రథమా తత్పురుష సమాసం' అంటాం.

కింది వాటిని పరిశీలించండి.

నఞ్ + సత్యం = అసత్యం = సత్యము కానిది

నఞ్ + భయం = అభయం = భయం కానిది

నఞ్ + న్యాయము =అన్యాయము = న్యాయము కానిది

నఞ్ + అంతము = అనంతము =అంతము కానిది

నఞ్+ ఉచితము = అనుచితము = ఉచితము కానిది

సంస్కృతంలో 'నఞ్' అనే అవ్యయం వ్యతిరేకార్థ బోధకం. దీనికి బదులు తెలుగులో అ, అన్ అనే ప్రత్యయాలు వాడుతారు.

పై ఉదాహరణల్లో వాడిన 'నఞ్' అనే అవ్యయాన్ని అనుసరించి దీన్ని 'నఞ్ తత్పురుష సమాసం' అంటారు.

© SCERT not to be republished

4. కింది పదాలకు విగ్రహవాక్యాలు, సమాసపదాలు రాసి, సమాసం పేరు రాయండి.

| సమాస పదం | విగ్రహ వాక్యం | సమాసం పేరు |
|---|---|---|
| (అ) అర్ధరాత్రి | | |
| (ఆ) అనూహ్యము | | |
| (ఇ) | క్రమం కానిది | |
| (ఈ) అనాసక్తి | | |
| (ఉ) | వినయం కానిది | |

5. తత్పురుష సమాసానికి చెందిన పదాలను ఇంతకుముందు పాఠాల్లో వెదకండి. పట్టికలో రాయండి.

| సమాసం పేరు | విగ్రహ వాక్యం | సమాస పదం |
|---|---|---|
| ప్రథమా తత్పురుషసమాసం | | |
| ద్వితీయా తత్పురుషసమాసం | | |
| తృతీయా తత్పురుషసమాసం | | |
| చతుర్థీ తత్పురుషసమాసం | | |
| పంచమీ తత్పురుషసమాసం | | |
| షష్ఠీ తత్పురుషసమాసం | | |
| సప్తమీ తత్పురుషసమాసం | | |
| నఙ్ తత్పురుషసమాసం | | |

© SCERT not to be republished

**ప్రాజెక్టు పని**

సంఘంలో దురాచారాలను రూపుమాపటం కోసం కృషి చేసిన సంఘసంస్కర్తలలో కొందరి చిత్రపటాలు, వారి సేవల వివరాలు పాఠశాల గ్రంథాలయం నుండి / పత్రికలనుండి సేకరించి ప్రదర్శించండి.

**నేనివి చేయగలనా ?**

1. సమాజంలోని దురాచారాలు, సదాచారాల గురించిన చర్చల్లో పాల్గొనగలను. ఔను / కాదు
2. పాఠం చదివి, కీలక పదాలు గుర్తించి వివరించగలను. ఔను / కాదు
3. సమర్థిస్తూ, వ్యతిరేకిస్తూ, నా అభిప్రాయాలను సొంతమాటల్లో రాయగలను. ఔను / కాదు
4. సాంఘిక దురాచారాలను ఖండిస్తూ ప్రజలను ఆలోచింపజేసే "పోస్టర్" తయారు చేయగలను. ఔను / కాదు

ఆశ ఎంతదూరమైనా నడిపిస్తుంది. ఆశయం అంతదూరమూ తోడుంటుంది.